



మృతి చెందిన అంజలి భర్తతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారిణి

టిడిపి నాయకుడి

దారుణ హత్య



హత్యకు గురైన దుద్దకుంట అమర్‌నాథ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీ సత్యసాయి జిల్లా పట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం కటాలపల్లి గ్రామంలో టిడిపి నాయకుడు ఆదివారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. తోట వద్ద నిద్రించిన దుద్దుకుంట అమర్నాథ్‌రెడ్డి(40)ను గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. కాగా ఈ హత్య రాజకీయ హత్యని టిడిపి నాయకలు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం హత్యలో రాజకీయ కోణం లేదని, వ్యక్తిగత ఘర్షణలతోనే హత్య జరిగినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలినట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా ఎన్నికల సమీపిస్తున్న వేళ టిడిపి నాయకుడు హత్యకు గురికావడంతో తీవ్ర సంచలనం రేపుతోంది.

వార్త మెయిన్‌లో

ఎన్నికలంటేనే ధన ప్రవాహంగా మారిన విషయం తెలిసిందే. ప్రచారంలో అడుగుతీసి అడుగు వేయాలంటే వేలల్లో ఖర్చు చేయాలి. హంగూ ఆర్భాటాలతో చేయాలంటే రోజుకు లక్షల్లోనే అవుతుంది. ఈ ఖర్చులతో అభ్యర్థులు ఖంగుతింటున్నారు. నీళ్లలో నోట్ల కట్టలు ఖర్చు చేయాల్సి రావడంతో ప్రచారం అంటేనే వెనుకడుగు వేయాల్సిన



తడిసి మోపెడు..!

◆ ప్రచారమంటేనే వెనకడుగు వేస్తున్న అభ్యర్థులు
◆ రోజుకు సగటున రూ.5లక్షల వరకు ఖర్చు
◆ నామినేషన్ల తరువాత రెండింతలవుతుందని గుబులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ వెలువడంతో ప్రచార హడావుడి పెరిగింది. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ ముఖ్యం కావడంతో అందరినీ బాగా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుంది. ఏ మాత్రం తేడా వచ్చిన ఫలితాలపై ప్రభావం ఉంటుంది. దీంతో టిక్కెట్టు ఖరారైన నాయకులు నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలూ సమకూర్చాల్సి ఉంటుంది. ఈ రకమైన ఏర్పాట్లు చేయడానికి నేతలకు తడిసి మోపెడవుతోంది. దీంతో ప్రచారాలకు బయటకు అడుగు పెట్టాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. సమయమైనా తక్కువ ఉంటే ఖర్చు కొంత తక్కువగా ఉండేదని, ఎన్నికల సమయం చాలా ఎక్కువగా ఉండటంతో రోజువారి ఖర్చు భారీగా పెరుగుతోందని అభ్యర్థులు సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసుకునే పరిస్థితులున్నాయి. దీంతో కొంత మంది ఇప్పటికప్పుడు ప్రచారాలు ప్రారంభించడం ఎందుకని తాము దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులను ప్రచారాలకు తిప్పుతున్నారు. వారైతే కొంత ఖర్చు తగ్గుతుందని, చివరాఖర్లో తాము ప్రచారాలు మొదలుపెడితే సరిపోతుందన్న భావనలోనున్నట్టు తెలుస్తోంది. ప్రచారం నిమిత్తం అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు బయటకు వెళితే రోజుకు సగటున ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు వస్తున్నట్లు ఒక అంచనా. ఇంకా ఎన్నికలకు 48 రోజుల వరకు సమయముంది. ఈ లెక్కన అన్ని రోజులకు కలిపి తక్కువలో తక్కువ అన్న రెండున్నర కోట్ల రూపాయల వరకు సాధారణ ఖర్చులకే అవుతోంది. ఇక నామినేషన్ల తరవాత నుంచి ఈ ఖర్చు రెండింతలు పెరిగే అవకాశముంది. ఆ తరువాత ఎన్నికల సమయంలో ఓటర్లకు పంచే డబ్బులు కలిపి మొత్తం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. పోటీ ఎక్కువ ఉన్న చోట మరింత భారం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ నాలుగో విడత కాకుండా ముందుగా వచ్చి ఉంటే చాలా వరకు ఖర్చు తగ్గి ఉండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. కులాలు, బలమున్న నాయకులను ఆకర్షించుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. అందుకు అవసరమైన తాయిళాలు, పనులు చేసి పెడుతున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎంత ఖర్చు అవుతుందోనని ప్రధాన పార్టీల అభ్యర్థులు భయపడిపోతున్నారు. ఇదే సమయంలో రంజాన్ వంటి పండుగలు కూడా రావడంతో ఇఫ్తార్ విందులు ఇవ్వాల్సి వస్తోంది. మైనార్టీలను ఆకట్టుకునేందుకు ఈ ప్రయత్నాలు సాగుతున్నాయి. నేరుగా తమ పేరు మీద కాకుండా అనుయాయుల పేర్లతో వారు విందు ఇస్తే తాము పాల్గొంటున్నట్టుగా సాగుతున్నాయి. యువతకు ప్రత్యేకమైన విందులు, క్రీడా సామగ్రి అందించే ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇన్ని రకాల ఖర్చులు వస్తున్నాయి. కోట్లాది రూపాయలు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. పెట్టకపోతే ప్రత్యర్థి కంటే వెనుకబడి పోతామన్న భయం వెంటాడుతోంది. ఇలా ఖర్చుతో అభ్యర్థులు ప్రచారం అంటేనే భయపడాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి.

కనికరం కరువు..!

◆ 'ఆకలి చావు'పైనా కనిపించని స్పందన
◆ నానమ్మ భిక్షాటనతోనే పిల్లలకు తిండి
◆ సాయంత్రానికి చిన్నారుల వద్దకొచ్చిన ఐసిడిఎస్ అధికారిణి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఒక గర్భిణి ఆకలి చావుతో ఆదివారం నాడు మరణించింది. ఈ హృదయ విదారక ఘటన మనస్సున్న ప్రతి ఒక్కరినీ చలించివేసింది. అయితే అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం కన్పించలేదు. బాధిత కుటుంబం ఇప్పటికీ కలెక్టరేట్ ఎదుటనున్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ఎదుటే ఉంటోంది. మృతిరాలి భర్త రాజు ఎప్పటిలాగానే పూటుగా తాగిపడిపోయి ఉండగా, పిల్లలు అఖిల (14), చరణ్(12), సాయి(10)కు నానమ్మ బిక్షాటన చేసి తీసుకొచ్చిన తిండే సోమవారం కూడా ఆహారమైంది. ఉదయం నుంచి వారి స్థితిగతులు తెలుసుకున్న అధికారులెవరూ లేరు. సాయంత్రానికి మాత్రం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసరు చంద్రకళ వచ్చారు. ఆమె మృతురాలి భర్త రాజుతో మాట్లాడారు. బాలికను బాల సదనంలో చేరుస్తామని ఇద్దరు మగపిల్లలను వసతి గృహంలో చేరుస్తామని చెప్పారు. తాగిన మైకంలోనున్న రాజు దానికి కూడా అంగీకరించే పరిస్థితి కనిపించలేదు.

నానమ్మ బిక్షాటనతోనే పిల్లలకు ఆహారం

అకలితో మరణించిన అంజలి పిల్లలకు నాన్నమ్మ తులసమ్మ అనంతపురం నగరంలో బిక్షాటన చేసి ఆహారం పెడుతోంది. సోమవారం నాడు కూడా ముగ్గురు పిల్లలు బిక్షాటన చేసి తీసుకొచ్చిన ఆహారంతోనే కడుపనింపుకున్నారు. అది లేకుంటే పిల్లలు కూడా పస్తులుండాల్సిన పరిస్థితి ఉంది. ముగ్గురు పిల్లల చదువులు కూడా మధ్యలోనే ఆగాయి. అఖిల ఆరవ తరగతి వరకు చదువుకుని చదువు మానేసింది. ఇద్దరు మగపిల్లలు బడి మెట్లు ఎక్కిన దాఖలాలు లేవు. ఈ పిల్లలకు ఆధార్‌కార్డు కూడా ఇప్పటి వరకు లేకపోవడం గమనార్హం.

హాస్టల్‌లో చేరుస్తాం

చంద్రకళ, ఐసిడిఎస్ అధికారిణి.

మరణించిన అంజిలి ముగ్గురు పిల్లలను హాస్టల్‌లో చేర్చి మంచి విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ అధికారిణి చంద్రకళ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద ఉన్న అంజలి పిల్లలు, భర్తతో మాట్లాడారు. అంజలి కూతురు అఖిలను వెంటనే బాలసదనంకు తీసుకెళ్తామన్నారు. ఇద్దరు మగపిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పిస్తామన్నారు. మంగళవారం నాడు వారిని తీసుకెళ్లే ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు.

పోలీసు స్టేషన్‌లో

'బంగారం' వాహనం..!

రూ.15 కోట్లు విలువజేసే బంగారు, వజ్రాలు ఉన్నట్లు సమాచారం

ప్రజాశక్తి-చిలమత్తూరు



బంగారు ఆభరణాలతో పట్టుబడిన వాహనం

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద బంగారు నగలను తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని ఎన్నికల తనిఖీ అధికారులు పట్టుకున్నారు. ఇందులో ఓ ప్రముఖ బంగారు షాపునకు చెందిన రూ.15 కోట్ల విలువజేసే బంగారు ఆభరణాలు, వజ్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. వాహనాన్ని పట్టుకున్న అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో ఉంచుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సోమవారం ఉదయం చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఎన్నికల సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా బెంగుళూరు నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న జీపును తనిఖీ చేయగా అందులో ఓ ప్రముఖ బంగారు నగల షోరూంకు సంబంధించిన బంగారు నగలు, వజ్రాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన పత్రాల పరిశీలన నిమిత్తం జీపును చిలమత్తూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీటి పరిశీలన నిమిత్తం పోలీసులు జిల్లా ఉన్నతాధికారుల, కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు సమాచారం తెలియజేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తహశీల్దార్ భాగ్యలత, కమర్షియల్ ట్యాక్స్ అధికారి మధుసుధన్ రెడ్డిలు పత్రాలను పరిశీలించారు. అయితే వాహనంలో ఉన్న నగలను మాత్రం చూడలేదు. సోమవారం రాత్రి వరకు వాహనాన్ని చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. పూర్తి స్థాయిలో పత్రాలను పరిశీలించిన అనంతరమే వాహనాన్ని వదిలివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. బంగారు నగలు ఉన్న వాహనానికి సాయుధ బలగాలతో భద్రత కల్పించారు.

ఎపిని డ్రగ్స్ కేంద్రంగా మార్చిన వైసిపి

మడకశిర టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ కేంద్రంగా మార్చిందని నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే ఈరన్న, కుంచిటి ఒక్కరిగ రాష్ట్ర కన్వీనర్ విఎం పాండురంగప్ప, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తితో కలిసి మాట్లాడారు. విశాఖ తీరంలో సిబిఐ, కస్టమ్స్ అధికారులు డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడంపై స్పందించారు. డ్రగ్స్ రాకెట్‌లో వైసిపి ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. వైసిపి మాఫియా వల్ల ఎపి దేశానికి డ్రగ్ రాజధానిగా మారిందన్నారు. విశాఖ పోర్టులో 25వేల కిలోల డ్రగ్స్‌ని సిబిఐ స్వాధీనం చేసుకోవడం, వారికి పోలీసులు, పోర్ట్ ఉద్యోగులు సహకరించకపోవడం అధికార పక్ష ప్రమేయాన్ని స్పష్టం చేస్తుందని ఆరోపించారు. ఇంత భారీస్థాయిలో డ్రగ్స్ ఎపికి ఎలా చేరాయన్నది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. డ్రగ్స్‌తో యువత భవి ష్యత్తు ప్రమాదంలో పడుతుందని, డ్రగ్స్ రాకెట్‌కు కారణమైన వారిని పట్టుకుని శిక్షించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రవిభూషణ్, ఎంపిపిలు కృష్ణమూర్తి, అశ్వర్థా మప్ప, బొజ్జప్ప, ఆదినారాయణ, నాయకులు రామాంజనేయులు, దాదు, కిష్టప్ప,, రమేష్, రామన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి సునీల్‌కుమార్

నేటి నుంచి టిడిపి ఎన్నికల ప్రచారం

నియోజకవర్గంలో మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారం చేపడుతున్నట్లు కూటమి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుడిబండ మండలంలోని శంకరగల్లు పంచాయతీలో మంగళవారం నిర్వహించే ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకు లతో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, నాయకులు పాండురంగప్ప, నరసింహ మూర్తి, రవిభూషణ్, ఆదినారాయణ, కృష్ణమూర్తి, అశ్వత్తరామప్ప, బొజ్జప్ప, జనసేన నాయకులు రంగ స్వామి, శివాజీ, ఉగ్రనరసింహా, ప్రకాష్, లెజెండ్ సుధాకర్, కృష్ణమూర్తి, నరసేగౌడ్, కిష్టప్ప, జయరామప్ప, రామన్న, రమేష్, నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి : సవితమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె సోమవారం నగర పంచాయతీ పరిధిలోని అర్బన్ కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్, గాంధీ సర్కిల్ మీదుగా స్థానిక టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెనుకొండ అభివృద్ధి చెందింది టీడీపీ హయాంలోనే అని, మరింత అభివృద్ధి చేసిది టీడీపీనే అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రామలింగనాయుడు, రఘువీర, షౌకత్, సుబ్రహ్మణ్యం, కోనాపురం ప్రసాద్, నజీర్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం రొద్దం మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామకృష్ణప్ప, పరిగి మండలం బీచిగానపల్లి గ్రామానికి చెందిన క్రిష్టప్ప, సరోజమ్మ, హరీష్, శ్రీకాంత్, సోమందేపల్లి మండలంలోని పందిపర్తి గ్రామానికి చెందిన బాబు, అంజ నప్ప, నాగరాజు, రామచంద్రప్ప, బంగారు బాబు వైసిపి నుంచి టిడిపిలోకి చేరారు. వారికి సవితమ్మ టిడిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న సవితమ్మ

టిడిపి ఎన్నికల ప్రచారం ప్రారంభం

లేపాక్షి : మండలంలోని కొండూరు గ్రామంలో సోమవారం టిడిపి మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలి వారు ప్రజలను కోరారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు శ్రీనివాస రావు హాజరై మాట్లాడుతూ టిడిపి కంచుకోటను పదిలంగా ఉంచాలని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలి అంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి సిద్ధా, నాయకులు ఆనంద్‌కుమార్, రామాంజనమ్మ, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి

జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ తెలిపారు. పట్టణంలోని పావగడ రోడ్డులో ఉన్న చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచార కార్యక్రమంలో మాజీమంత్రి నర్సేగౌడ్ మాట్లాడుతూ సిఎం జగన్ అన్ని వర్గాల వారిని ఆదుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని, కావున మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యేగా ఈరలక్కప్ప, ఎంపిగా బోయ శాంతమ్మలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఒక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ నళినిరంగేగౌడ్, నాయకులు వైసి.గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, కాంతరాజు, జిబి.శివకుమార్, బిఎల్.రామకృష్ణ, పుట్టకామప్ప, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వైసిపి నాయకులు

హోలీ సంబరాల్లో రఘువీరా కుటుంబ సభ్యులు

మడకశిర : హోలీ సందర్భంగా సోమవారం సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు బెంగళూరులోని వారి బంధువుల ఇంట్లో రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. రఘువీరారెడ్డి భార్య సునీతరఘువీర్, కుమార్తె అమృతవీర్, కుమారుడు, మనవరాలితో కలిసి ఆనందంగా రంగులు చల్లుకున్నారు. ఆనవాయితీగా జరిగే హోలీ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని రఘువీరా తెలిపారు.



హోలీ సంబరాలు చేసుకుంటున్న రఘువీర కుటుంబ సభ్యులు



గోపాలకృష్ణను పరామర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి

పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి పరామర్శ

మడకశిర : పట్టణంలోని వర్తక వ్యాపార ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎఎస్.గోపాలకష్ణ వారం రోజుల క్రితం భూ వివాదంలో గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సోమవారం గోపాలకృష్ణ ఇంటికి వెళ్లి పరమర్శించారు. ఆయ న వెంట శ్రీనివాసమూర్తి, కిషోర్, మనోహర్, నరేష్, బేగార్ల రవి, కౌన్సిలర్ ఉమాశంకర్, తిమ్మరాజు, కంబాలపల్లి శ్రీనివాసులు, లోకేశ్ ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

కొత్తచెరువు : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కొత్తచెరువు సిఐ రాజా రమేష్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కొత్తచెరువులో స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, ఎఎస్ఐ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి టౌన్ : కదిరి శ్రీవారి బ్రహ్మోత్సవములలో భాగంగా కదిరి పున్నమి పండుగ పురస్కరించుకొని సోమవారం శ్రీ ఖాద్రీశునీ దర్శనానికి భక్తులు పోటెత్తారు. కర్నాటక తదితర ప్రాంతాల నుండి అధికసంఖ్యలో వచ్చిన వారితో ఆలయం కిక్కిరిసింది. భక్తుల సౌకర్యార్థము ప్రత్యేక దర్శనము, ఉచిత దర్శనము క్యూలైన్లను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

ఆధారాల్లేకుండా నగదు తరలిస్తే చర్యలు

బత్తలపల్లి : ఇతర ప్రాంతాలకు నగదు తరలింపు విషయంలో సరైన ఆధారాలు, పత్రాలు తప్పని సరి అని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని యర్రాయ పల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెకాపోస్టులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నగదు విషయంలో పరిమితులు విధింపు ఉందని అన్నారు. ఎవరైనా రూ.50వేలు వరకు మాత్రమే తీసుకువెళ్లవచ్చునని. అంతకు మించి తీసుకువెళ్లితే అనుమతి పొందాలని, లేదంటే ఆ సొమ్మును సీజ్ చేయక తప్పదని హెచ్చరించారు. డబ్బు, మద్యం తీసుకువెళ్లేవారు రశీదు కలిగి. అదికారుల నుంచి అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేశారు.

ఉచిత విద్యకు దరఖాస్తు గడువు పెంపు

ధర్మవరం టౌన్ : ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు పెంచినట్లు ఎంఇఒ గోపాల్ నాయక్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి (2024-25) విద్యా హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోని పిల్లలైన అనాథలు, హెచ్ఐవి బాధితులు, వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసి వర్గాల పిల్లలకు ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించబడుతుందని చెప్పారు. వీరందరికీ విద్యా హక్కు చట్టం కింద ప్రయివేటు, అన్ ఎడిట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు కేటాయించబడినట్లు తెలిపారు. పట్టణంలోని సచివాలయం లేదా ఇంటర్నెట్, ఎంఇఒ కార్యాలయం, మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కన్నుల పండువగా లంకాదహనం

బత్తలపల్లి : మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలోని కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లంకాదహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈదుల ముష్టూరు గ్రామం నుంచి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ప్రభను క్షేత్రంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. దీనినే లంకాదహనంగా చెప్పుకుంటారు. ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ముష్టూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ రేణుక, ఓబిరెడ్డి, గోవర్ధనరెడ్డి, రవీంద్రారెడ్డి, సాయి సింహారెడ్డి, రాజసింహారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి దేవేంద్రరెడ్డి, ఆనందరెడ్డి, గంగాదరరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

హిందూపురం : ఈ నెల 29న సెబ్ స్టేషన్‌లో 22 ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు సెబ్ సిఐ రాజశేఖర్ గౌడ్ సోమవారం తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు 22 వాహనాలను వేలం వేస్తున్నామన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఆధార్, పాన్ కార్డు తీసుకురావాలన్నారు. రూ.5వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. చెల్లించిన డిపాజిట్ ను బహిరంగ వేలం అనంతరం తిరిగి చెల్లిస్తామన్నారు. బహిరంగ వేలంలో వాహనాలను దక్కించుకున్నవారు 18 శాతం జిఎస్‌టితో మొత్తం నగదును చెల్లించాల్సి ఉంటుందన్నారు.

'రాష్ట్ర వ్యాప్తంగా స్వతంత్రంగా పోటీ చేస్తాం'

గోరంట్ల : వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా స్వతంత్రంగా పోటీ చేస్తామని వడ్డెర సంఘం నాయకులు న్యాయవాది ఎస్ఆర్.ఆంజనేయులు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక సరస్వతీ విద్యా మందిరం లో వడ్డెర సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు వడ్డెర్ల పట్ల అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది వడ్డెర కులస్తుల ఓట్లు ఉన్నాయని, చాలా నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను శాశించే స్థాయిలో వడ్డెర్ల ఓట్లు ఉన్నాయన్నారు. వడ్డెర్లను రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయే తప్ప రాజకీయంగా అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వడ్డెర్లను గుర్తించని రాజకీయ పార్టీలకు తాము ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నిచారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వేముల గోవిందరాజులు, సుధాకర్, కవి మహేష్, సోమశేఖర్, త్యాగరాజు, సురేంద్ర, మహేంద్ర, రాము, రమేష్, మనోహర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

ఓటు నమోదుకు గడువుపెంపు

ధర్మవరం టౌన్ : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అందరికీ ఓటు హక్కు కల్పించేందుకు కేంద్ర ఎన్నికల అధికారి కార్యాలయం ఆదేశాల మేరకు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓటు నమోదుకు గడువు పెంచినట్లు ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదుకు కల్పించిన మరో చివరి అవకాశాన్ని అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పన్నుల చెల్లింపుపై వడ్డీ మాఫీ

ధర్మవరం టౌన్ : మున్సిపల్ పన్నుల చెల్లింపుపై వడ్డీ మాఫీ అవకాశాన్నిపట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆదా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, ఖాళీజాగా, నీటి పన్నులు, దీర్ఘకాలిక పన్నులు ఈనెల 31వ తేదీ లోపు ఏక మొత్తంగా చెల్లించినట్లయితే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. వడ్డీ మాఫీ పొందాలంటే పన్ను చెల్లింపు దారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కేవలం ఆరు రోజులు గడువు ఉన్నందున ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఓబుల దేవర చెరువు : మండలంలోని దాదిరెడ్డిపల్లి గ్రామంలోని అక్కదేవతల ఆలయ అభివృద్ధికి దాతలు విరాళం అందజేశారు. ఆలయంలో అన్నదాన సత్రానికి గోపేపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున 20వేల రూపాయిలు విరాళం ఇచ్చారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ముదిగుబ్బ : మండలంలోని వల్లెంచెర్లోపల్లి గ్రామంలో ఏడు రోజులుగా ఎన్ఎస్ఎస్ పిఒ సురేష్ ఆధ్వర్యంలో వాలంటీర్లు సోమవారం శ్రమదానం చేశారు. మట్టి రోడ్లు మరమ్మతులు చేశారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సర్పంచి గోపాల్, ఎస్‌డిఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ తారకేశ్వర్, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేస్తాం

పుట్టపర్తి రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో శ్రీ సత్యసాయి జిల్లాలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోటీ చేయనుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలు మామిడి విష్ణు నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోటీ చేయనుందని ప్రజల సహకరించాలని కోరారు. పార్టీ గురించి పలు విషయాలు గ్రామ ప్రజలకు తెలిపారు. మార్చి 31న పుట్టపర్తి లో నిర్వహించబోయే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా విస్తతస్తాయి సమావేశంలో పాల్గొని కార్యక్రమన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA.
O.S. No: 39/2023
BETWEEN
Pati Hanumantha Reddy ...Plaintiff
AND
S.Anitha and others ...Defendants
NOTICE TO THE DEFENDANTS NO.1 to 3
To
D1: S.Anitha W/o Late S.Chandra Sekhar Reddy,
D2:S.Dheekshith Reddy S/o Late S.Chandra Sekhar Reddy
D3: S.Dhruvan Reddy S/o Late S.Chandra Sekhar Reddy, No.2 and 3 are Minors Rep by their Natural Guardin mother i.e., Defendant no.1 S.Anitha.W/o Late S.Chandra Sekhar Reddy,
All are R/o Venkataramanapalli Village, Puleru Post, Gorantla Mandal, Sri Sathya Sai District.
వాది మీ పైన విక్రయం పొందుటకు పై దావా కోర్టు నందు వేసినారు.మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపిననూ అవి జారీ కావడం లేదు. కావున ఈ ప్రకటన చూసిన అనంతరం పై కోర్టు నందు 28/03/2024వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానిచో మీ పరోక్షము నందు దావా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
వాయిదా తేది:28/03/2024
(By order of the court)
సి.ఆర్.నాగార్జున, M.A., M.L,
అడ్వకేట్, పెనుకొండ, అనంతపురం జిల్లా.
సెల్:9492584259.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
I.A. No: 605/2022 in O.S.No :28/2016
Between:
మూడే గోపినాయక్ S/o మూడే సోమ్లానాయక్, Residing at మూర్తిపల్లి, కదిరి మండలం శ్రీ సత్యసాయి జిల్లా. ...Petitioner
మరియు
కిన్నెర రమణమ్మ మరియు ఇతరులు ...Respondents
R5: భాష్యం శ్రీదేవి W/o లేట్ బి.శ్రీనివాసులు,
R6: భాష్యం నిరంజన్ యాదవ్ S/o లేట్ బి.శ్రీనివాసులు,
R7: భాష్యం హరిణి D/o లేట్ బి.శ్రీనివాసులు, No.6 and 7 Minors Rep.By Mother and Guardian R5 భాష్యం శ్రీదేవి All are Residing at మూర్తిపల్లి, కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...Respondents
పై పిటీషన్‌లోని R5, R6 మరియు R7 ప్రతివాదులకు నోటీసులు
పై దావాలోని వాది (మూడే గోపి నాయక్) D3. బి.శ్రీనివాసులు చనిపోయినందున, వారి వారసులుగా మిమ్ములను చేర్చుట కొరకు పై పిటీషన్ దాఖలు వేసి యున్నారు. పై పిటీషన్‌ను ఘనమైన కోర్టు వారు 04/04/2024 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 04/04/2024 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటీషన్‌ను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:04/04/2024
స్థలం:కదిరి
జి.గురులింగస్వామి, బి.ఎ., బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి.

'ఆలయంలో అధికార దర్పం'


తన అనుచరగణంతో కలసి ఆలయంలోకి వెళుతున్న తాజా, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

శ్రీవారి సేవలో మంత్రికి రాచబాట
సామాన్యులకు రెండుగంటల పాటు తప్పని ఇక్కట్లు
ఎన్నికల కోడ్ మంత్రికి వర్తించదా..?

ప్రజాశక్తి కదిరి టౌన్
రాష్ట్ర శ్రీ శిశు సంక్షేమ శాఖ తాజా, మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఖాద్రీశు డిదర్శనంలోనూ అధికార దర్పం ప్రదర్శించారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కదిరి పట్టణంలోని శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు 15 రోజులు పాటు జరగనున్నాయి. అందులో భాగంగా సోమవారం కదిరి పున్నమి సందర్భంగా తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్నారు. శ్రీవారి దర్శనం కోసం సోమవారం తెల్లవారుజాము నుండే భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లో వేచి ఉన్నారు. ఇదే సందర్భంలో ఆలయ దర్శనానికి తాజా, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ వస్తున్నట్లు ఆమె కార్యాలయం నుండి దేవాలయ అధికారులకు సమాచారం వచ్చింది. అయితే మంత్రితో పాటు కొద్దిమందికి మాత్రమే దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే వీటన్నింటిని పట్టించుకోని తాజా, మాజీ మంత్రి ఆలయంలోనూ అధికార దర్పం ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె దాదాపు 40 మందిని వెంటేసుకొని రెండు గంటలపాటు ఆలయంలో హల్‌చల్ చేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దాదాపు రెండు గంటలపాటు తీవ్ర ఇక్కట్లకు లోనయ్యారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు క్యూ లైన్ లోనే వేచి ఉంటూ తాగడానికి నీరు లేక ఎండ వేడిమి లోనే తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. స్వామి దర్శనంకోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చామని సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించకుండా అసౌకర్యానికి గురి చేస్తూ కోడ్ అమల్లో ఉన్నప్పటికి ఎన్నికల కోడ్ ఉల్లంగిస్తూ అధికారులు మంత్రికి, వారి అనుచరులకు సకల మర్యాదలు చేయడం ఏమటని ప్రశ్నించారు. న్నికల కోడ్ తాజా, మాజీ మంత్రికి వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

భూముల అన్యాక్రాంతంపై రైతుల ఆందోళన


తమతో ఉన్న ఆధారాలు చూపుతున్న బాధిత రైతులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్
మండలంలోని పలు గ్రామాల్లో భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించాలని, అందుకు బాధ్యులైన వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండు చేశారు. సోమవారం మండల పరిధిలోని కప్పలబండ, జగరాజుపల్లి గ్రామాలకు చెందిన రైతులు నారాయణప్ప నరసమ్మ, ఉమామహేశ్వర్రావు, నరసన్న, గజేంద్ర, గంగాద్రి ప్రశాంత్ తదితరులు మాట్లాడుతూ తమకు చెందిన భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదుచేయించి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు నిరాకరిస్తున్నారని విమర్శించారు. ఇది సివిల్ అంశమని, జిల్లా లేదా మండల రెవిన్యూ అధికారుల పరిధిలోకి వస్తుందని, భూమి అన్యాక్రాంతం అయిందీ లేనిదీ వారు తేల్చాలని, అనంతరమే తాము రంగంలోకి దిగుతామని పోలీసులు చెబుతున్నారని చెప్పారు. తమకు చెందిన భూములపై అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తిమ్మరాజు అనే వ్యక్తి పేరున ఎలా ఆన్‌లైన్ చేస్తారని ప్రశ్నించారు. సర్వే నంబర్ 35 లో వాస్తవ విస్తీర్ణం 24,70 ఎకరాలు ఉండగా అధికారులు ఆన్‌లైన్‌లో 28.20 ఎకరాలుగా నమోదు చేశారని అన్నారు. ఒకే నంబరుతో ఇద్దరికి ఒక్కొక్కరికి 3.50 ఏకరాల చొప్పున నమోదు చేశారని చెప్పారు. ఎఫ్ఎంబిలో 24.70 ఎకరాలు ఉంటే ఆన్‌లైన్‌లో అద నంగా మరికొంత భూమినిచేర్చి 28.20 ఎకరాలుగా చూపారని అన్నారు. భూమిలేక పోయినా ఉన్నట్లు చూపడం ఎవరిని మోసం చేయడానికని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఆన్‌లైన్‌లో తమ పేరున భూమి ఉందని దళారులు రంగప్రవేశం చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తేగాని తమకు భూములు అన్యాక్రాంతమయిన విషయం తెలియదనివాపోయారు. భూ అక్రమాలకు సహకరించిన, పాల్పడిన వారిపై న్యాయపోరాటానికి వెనుకాడమని రైతులు హెచ్చరించారు.

సిపిఎస్ రద్దుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి సుధాకర్ కోరారు. స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయకార్యాలయంలో సోమవారం జిల్లాకార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల కాలంలో యుటిఎఫ్ స్వతంత్రంగా ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాల కార్యాచరణలోనూ మండలస్థాయి నుంచి డిల్లీస్థాయి వరకూ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉ పాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించి సిపిఎస్‌ను రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విదానాన్ని కొనసాగించే విధంగా పున్ణ సమీక్షించాలని వారు కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్ వలీ, శివశంకర్, లక్ష్మీనారాయణ, జీసీ నరేశ్, ఆడిట్ కమిటి సభ్యులు ఆజంబాషా తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ హంద్రీనీవా నీరు

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్
పుట్టపర్తి నియోజకవర్గంలో అన్ని చెరువులకు హంద్రీనీవా నీరు తీసుకురావడమే తమ లక్ష్యమని పుట్టపర్తి టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తన భర్త పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డితో కలసి మండల పరిధిలోని కేశాపురం, కొడ పగానిపల్లి, పంచాయతీలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమెకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా ,లేకపోయినా ప్రజల కష్టాల్లో పాలుపంచుకున్న వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది పల్లె రఘునాథ్ రెడ్డి అనిఈ ప్రాంత ప్రజలే చెబుతున్నారని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాలక్క గారి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సాలక్క గారి వాణి శ్రీనివాస్, మండల కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సురేష్ నాయుడు, కిలారి శ్రీనాథ్, కిరణ్, కేసప్ప, వెంకటేశులు, రామచంద్ర, కిష్టప్ప, ఉపేంద్ర, పెద్దన్న, చెన్నారెడ్డి, చినరాయుడు, మాజీ ఎంపిటిసి చిన్నరాయుడు, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూర, తదితరులు

ఆత్మీయ సమావేశం


ప్రజాశక్తి కదిరి టౌన్
కదిరి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ సోమవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలు, విధి విధానాలపై పలు సూచనలు చేశారు. అలాగే ప్రతిపక్ష పార్టీల మోసపూరిత హామీలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తియార్ విందు : మున్సిపాలిటీ పరిధిలోని మదనపల్లి రోడ్ లో గల ఆల్ ఖైర్ మజీదులో సోమవారం ఏర్పాటుచేసిన ఇఫ్తియార్ విందులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రోజంతా ఉపవాస దీక్షల్లో ఉన్న మైనారిటీ సోదరులు సాయంత్రం ఆరున్నర గంటలకు దీక్షలు విరమించారు. ఉపవాస దీక్షల విరమించిన అనంతరం మసీదులో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పరికి సాదిక్‌బాషా, సాదత్ అలీ ఖాన్ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్
జిల్లా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు.. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతును సోమవారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని పుట్టపర్తి కదిరి సబ్ డివిజన్ పరిధిలోని కొత్తచెరువు , నల్లచెరువు మండల కేంద్రంలో సిఐ రాజా రమేష్ , ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి , కేంద్ర సాయిధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు.

రైతులకు రూ. 20 వేలు పంట సాయం : పల్లె


పార్టీలోకి చేరిన వారితో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్
టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి ఏటా రైతులకు రూ. 20 వేలు పంటసాయం అందిస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని బొంతలపల్లి, కంబాలపర్తి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈ ఎన్నికలలో టిడిపి అభ్యర్థిని ఆదరించాలని ఆయన కోరారు. వైసిపి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఈ ఐదేళ్లలో చేసింది ఏమీ లేదని ప్రజా దోపిడీ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బచ్చలి పుల్లయ్య, మండల కన్వీనర్ విజయ్ కుమార్, శ్రీరామ్ రెడ్డి, సర్పంచి శ్రీనివాసులు, కృష్ణబాబు, బొమ్మయ్య, దేవేంద్ర, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, పలువురు టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కొత్తచెరువు : వైసిపికి చెందిన పలువురు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టిడిపిలోకి చేరారు. కొత్తచెరువులోని గాంధీనగర్ పాత తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో సుమారు 35 కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. వారికి పల్లె టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, గాజుల చంద్ర, ఆర్ నాగేంద్ర, రాజు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మామపై దాడి కేసులో అల్లుడికి జైలు

బుక్కపట్నం : మామ పై దాడి చేసి గాయపరిచిన కేసులో అల్లునికి ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానాను కోర్టు విధించింది. అందుకు సంబంధించి ఎస్ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన శీను అనే వ్యక్తి 2013 వ సంవత్సరంలో తన భార్యతో గొడవ పడగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే తన మామ ఆయన నారాయణతో శీను గొడవపడ్డాడు. భార్య కూతుర్ని తన ఇంటికి పంపించమని అడిగాడు. ఈ విషయంలో మామా, అల్లుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈనేపథ్యంలో శీను తమ మామ నారాయణను కట్టెతో బలంగా కొట్టాడు. ఈ ఘటనలో నారాయణకు కాలు విరిగింది. ఈ క్రమంలోనే అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసుకొని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. ఈ క్రమంలోనే జెఎఫ్‌సిఎం కోర్టు ఏడుగురు సాక్షులను విచారించి సోమవారం తీర్పును వెలువరించింది. నిందితుడు శీనుకు వెయ్యి రూపాయల జరిమానా, ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ నగేష్ వాదించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి, సురేష్ బాబు సహకరించారు.

వ్యక్తిగత కారణాలతోనే అమర్నాథ్ రెడ్డి హత్య

పుట్టపర్తి రూరల్ : నల్లమాడ మండల పరిధిలోని కుటాలపల్లి గ్రామానికి చెందిన అమర్నాథ్ రెడ్డి హత్య కేవలం వ్యక్తిగత కారణాలతోనే జరిగినటుల తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని డిఎస్‌పి వాసుదేవన్ తెలిపారు. కుటాలపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన అమర్నాథ్ రెడ్డి హత్య ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి డీఎస్పీ వాసుదేవన్‌తో సోమవారం పరిశీలించారు. ఈ హత్య కేసును వెంటనే ఛేదించాలని ఎస్పీ ఆదేశించారు. ఈనేపథ్యంలో హత్య ఘటనకు సంబంధించిన ప్రాథమిక వివరాలను వెల్లడిస్తూ పుట్టపర్తి డీఎస్పీ ప్రకటన విడుదల చేశారు. నల్లమాడ మండలం కుటాలపల్లి గ్రామానికి చెందిన అమర్నాథ్ రెడ్డిని వ్యక్తిగత కారణాలవల్లే గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ హత్యకు ఎటువంటి రాజకీయ కోణం లేదని, కేవలం వ్యక్తిగత కారణాలతోనే ఈ హత్య జరిగి ఉండవచ్చని తెలుస్తోందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని త్వరలోనే అమర్నాథ్ రెడ్డి హత్యకు గల కారణాలను వెల్లడిస్తామని డీఎస్పీ వివరించారు.

కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

గోరంట్ల రూరల్ : మండలంలోని కొండాపురం పంచాయతీ రాగిమాకులపల్లి వద్ద సోమవారం పోలీసులు కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. కర్నాటక ప్రాంతం నుంచి అక్రమంగా మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తున్న వ్యక్తి రాగిమాకులపల్లి వద్ద పోలీసులను గమనించి టెట్రా ప్యాకెట్లను పారవేసి పరారయ్యే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతడిని వెంబడించి పెద్దఎత్తున హైవార్డ్స్ చీర్స్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. ఆ వ్యక్తిని మండలంలోని ఉగ్రంపల్లి గ్రామానికి చెందిన ఎస్.వెంకటేష్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలంలో ఎవరైనా కర్నాటక మద్యం తరలించినా, విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐ ప్రజలకు కోరారు. వివరాలు ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఆర్మీ మద్యం బాటిళ్లు స్వాధీనం

ధర్మవరం టౌన్ : పట్టణంలో శాంతినగర్ లో ఓ ఇంటిలో ఉన్న 12 ఆర్మీ మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐలు గురుప్రసాద్, రాజన్న తెలిపారు. పుట్టపర్తి ఎఎస్‌పి నాగభూషణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం ఆదేశాలమేరకు పట్టణంలోని శాంతినగర్‌లో పలు ఇళ్లలో సోమవారం దాడులు నిర్వహించారు. బత్తలశ్రీనివాసులు ఇంటిలో ఉన్న 12 ఆర్మీ మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది గిరీష్‌కుమార్, మల్లికార్జున, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

చిలమత్తూరు : మండల కేంద్రంలో సోమవారం శ్రీ కనుమ భూనీళ సమేత లక్ష్మి నరసింహస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ రథోత్సవంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలతో పాటు కర్నాటక ప్రాంతం నుండి పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాజకీయాపార్టీల మధ్య వాగ్వాదం : రథోత్సవానికి వచ్చిన టీడీపి,వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దేవాలయం నుండి స్వామి వారి ప్రతిమను రథం వద్దకు తీసుకొచ్చే క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాటతో మొదలై తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు ఆ ఘటన వద్ద లేకపోవడంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడేఘటన చోటు చేసుకుంది.ఈ తరుణంలో అక్కడ ఉన్న పెద్ద మనుషులు ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

టిడిపి ఎన్నికల ప్రచారం ప్రారంభం

హిందూపురం : టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పట్టణంలోని సూగూరు ఆంజినేయ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు మాట్లాడుతు ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తు, వైసిపి అవినీతిని ప్రజలకు తెలియజేస్తామన్నారు. అదే విధంగా రూరల్ మండలం బాలంపల్లి పంచాయతీలో నాయకులు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్ కుమార్, రాము, బిజెపి నాయకులు ఆదర్శ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ, సుబ్రమణ్యేశ్వర స్వామి రథోత్సవం

హిందూపురం : 70 సంవత్సరాల క్రితం పట్టణంలో స్థిరపడ్డ తమిళ భక్తులు సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తమిళ ఆచారం ప్రకారం టంగుణి నక్షత్రంలో వచ్చే పౌర్ణమి నాడు తమ మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ. పట్టణంలో ఇందిరా నగర్, ఫలని నగర్ ప్రాంతాలలో స్థిరపడిన తమిళ భక్తులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఒళ్లు గగుర్పాటు కల్పించే విన్యాసాలతో దేవాలయం నుండి పట్టణ వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. ఇదే సందర్భంగా హోలీ వేడుకలు సైతం జరుపుతున్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న ఆలయంలో వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపికలతో పాటు వైసిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రశాంతి నిలయంలో హోలీ వేడుకలు

పుట్టపర్తి అర్బన్ : ప్రశాంతి నిలయంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం బీహార్ రాష్ట్రం నుంచి పర్తియాత్రగా వచ్చిన భక్తులతో పాటు పలువురు దేశ విదేశీ సత్యసాయి భక్తులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఉదయం బీహార్ రాష్ట్ర భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సాయంత్రం నాటికలు, నృత్యాలు, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు సాయి కుల్వంత్ హాలు లో ఘనంగా జరిగాయి.

శేష వాహనంపై ఖాద్రీశుడు

ప్రజాశక్తి - కదిరి టౌన్
ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆదిశేషుడిని వాహనం పై శ్రీవారు తిరు వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం శేష వాహనంపై దర్శన భాగ్యం కల్పించారు. శేష వాహన ఉత్సవ కార్యక్రమానికి దివంగత యాదాళం శంకర్ నారాయణ శెట్టి కుమారులు యాదాళం శ్రీనివాసులు, బాలాజీ ఉభయదారులుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెండిదండి శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. స్వామి వారి ఉత్సవాలలో అవాంఛనీయ ఘటనలు చేసుకోకుండా డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో పట్టణ సిఐ పుల్లయ్య, ఎస్ఐలు, పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.


శేషవాహనంపై శ్రీవారు